ప్రజా రిపబ్లిక్ స్పెషల్
ప్రతి అక్షరం ప్రజల కోసం
1
RNI No: APTEL/2023/87888
శనివారం
25 అక్టోబర్ 2025

ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం

విశాఖ, అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది.

విశాఖకు 990 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమై ఉంది.

పశ్చిమ వాయవ్య దిశగా ఇది కదులుతోంది. 24 గంటల్లో బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ నెల 27 ఉదయానికి తుపానుగా మారే అవకాశం ఉంది. ఇది కోస్తాంధ్రపై ప్రభావం చూపనుంది. నైరుతి-పశ్చిమ బంగాళాఖాతం మధ్య తీరం దాటే సంకేతాలు కనిపిస్తున్నాయి.

తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్.. ఎప్పటి నుంచంటే..?

హైదరాబాద్, అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఇంటర్మీడియట్ సిలబస్ లోనూ ఇంటర్ బోర్డు ఈసారి మార్పులు చేసింది. ఇంటర్ మొదటి సంవత్సరంలోనూ ల్యాబ్స్, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండనున్నాయి.

శబరిమల బంగారు తాపడాల వివాదం..
బళ్లారిలో కేరళ పోలీసుల దర్యాప్తు

అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):శబరిమల ఆలయంలో బంగారు తాపడాల నుంచి వేరు చేసిన పసిడిని కర్ణాటకలోని ఓ వ్యాపారికి విక్రయించినట్లు ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టీ అంగీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కేరళ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

ఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలోని కేరళ సీసీబీ పోలీసుల బృందం శుక్రవారం బళ్లారికి చేరుకున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. బళ్లారిలోని ఓ బంగారు దుకాణంలో, స్థానికంగా ఉన్న ఇతర ప్రాంతాల్లో కేరళ పోలీసులు విచారణ చేపడుతున్నారన్నారు. అయితే ఈ విషయంపై కేరళ అధికారుల నుంచి తమకు ఎటువంటి అధికారిక సమాచారం అందలేదని తెలిపారు. చెన్నైలోని స్మార్ట్ క్రియేషన్స్లో ఈ బంగారు తాపడాల నుంచి పసిడిని వేరు చేసి.. పుత్తడిని బళ్లారికి చెందిన బంగారం వ్యాపారి గోవర్ధన్కు విక్రయించినట్లు ఉన్నికృష్ణన్ విచారణలో సిట్ అధికారులకు చెప్పారు. దీంతో గోవర్ధన్కు సిట్ అధికారులు సమన్లు జారీ చేశారు. ఉన్నికృష్ణన్ తనకు బంగారం విక్రయించడం నిజమేనని గోవర్ధన్ అంగీకరించాడు. అతడి వాంగ్మూలాన్ని రికార్డు చేసిన సిట్ అధికారులు.. ఉన్నికృష్ణన్ను తీసుకొని శుక్రవారం బెంగళూరు బయల్దేరారు. ఈ నేపథ్యంలోనే కేరళ పోలీసులు బళ్లారిలో విచారణ చేపట్టారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ 2004-2008 మధ్య శబరిమల ఆలయ పూజారికి సహాయకుడిగా పనిచేశాడు. అక్కడి ద్వారపాలకుల విగ్రహాలకు అమర్చిన రాగి రేకులకు 1998 లో బంగారు తాపడం చేసిన విషయం తెలుసుకున్నాడు. కాలక్రమంలో బెంగళూరులో వ్యాపారిగా స్థిరపడిన ఉన్నికృష్ణన్ పొట్టీ ఆలయ తాపడాల బంగారాన్ని తస్కరించడానికి ప్రణాళిక వేశాడు. బంగారు తాపడాలకు మెరుగులుదిద్దుతానని ప్రతిపాదించడంతో ఆలయ నిర్వాహకులు 2019లో ఆ పనిని అతడికి అప్పగించారు. తాపడాలను చెన్నైలోని ఓ సంస్థకు తీసుకెళ్లి వాటి నుంచి బంగారాన్ని తొలగించాడు. ఆ తర్వాత వాటిని తిరిగి అమర్చగా.. తాపడాలపై ఉన్న బంగారం బరువు తగ్గిన విషయం తాజాగా బయటపడింది.

ఈ దశాబ్దం మోదీదే:ఏపీ సీఎం చంద్రబాబు

అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ఈ దశాబ్దం మోదీదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం చేస్తానని వెల్లడించారు.

అప్రమత్తమైన రవాణా శాఖ..
హైదరాబాద్‌లో ప్రైవేటు బస్సుల విస్తృత తనిఖీలు

హైదరాబాద్, అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): కర్నూలు బస్సు ప్రమాద ఘటనతో తెలంగాణ రవాణా శాఖ అప్రమత్తమైంది. ప్రైవేటు బస్సులను అధికారులు తనిఖీ చేస్తున్నారు. విజయవాడ హైవే, బెంగళూరు హైవేపై ఆర్టీఏ బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి.

రాజేంద్రనగర్ పరిధి గగన్ పహాడ్ వద్ద సోదాలు చేశారు. ఏపీ నుంచి వస్తున్న ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేశారు. వాహనాల్లోని ఫైర్ సేఫ్టీ, మెడికల్ కిట్లను పరిశీలించారు. నిబంధనలు పాటించని 5 ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు. బస్సు అద్దం పగిలినా అలాగే నడుపుతున్న ట్రావెల్స్ బస్సును సీజ్ చేశారు. జడ్చర్ల వద్ద ఈ వాహనం రోడ్డుప్రమాదానికి గురైందని ప్రయాణికులు తెలిపారు. ఎల్బీ నగర్ లోని చింతలకుంట వద్ద ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్స్ బస్సును సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై తిరుగుతున్న మరో 4 బస్సులపై కేసులు నమోదు చేశారు.

ఆస్ట్రేలియా పర్యటన.. కొత్త భాగస్వామ్యాలపై
నమ్మకం కుదిరింది:మంత్రి నారా లోకేశ్

అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్): ఆస్ట్రేలియాలో 7 రోజుల పర్యటనతో.. ఆంధ్రప్రదేశ్ ప్రగతి దిశగా కొత్త భాగస్వామ్యాలపై నమ్మకం కుదిరిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు.

ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. నాలుగు నగరాల పర్యటనలో విశ్వవిద్యాలయాల సందర్శన, పారిశ్రామికవేత్తలతో భేటీలు జరిగాయని తెలిపారు. క్రీడలను శక్తిమంతమైన రంగంగా అభివృద్ధి చేసే అవకాశాలు విస్తారంగా ఉన్నాయన్నారు. భారతదేశం 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు సాగుతోందని చెప్పారు. ఈ సమయంలో, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ శక్తి బలోపేతం కావడం కీలకమని పేర్కొన్నారు. ఈ పర్యటన ఫలాలు త్వరలోనే ఆంధ్రప్రదేశ్కు ప్రయోజనకరమైన భాగస్వామ్యాలుగా మారతాయని లోకేశ్ ఆకాంక్షించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

'జటాధర'.. మూడు రోజుల్పు బ్రేక్ తీసుకోకుండా షూటింగ్

సుధీర్ బాబు ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'జటాధర'. వెంకట్ కల్యాణ్ దర్శకత్వంలో రూపొందుతోంది. హిందీ, తెలుగు భాషల్లో నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా దీని గురించి నిర్మాత శివన్ నారంగ్ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు."జటాధర విడుదలయ్యాక క్లైమాక్స్ గురించి అందరూ మాట్లాడుకుంటారు. దీనికోసం మూవీ టీమ్ మొత్తం ఎంతో కష్టపడింది. సుధీర్ బాబు, సోనాక్షి సిన్హా నిరంతరం సెట్లో ఉంటూ శ్రమించారు. వాళ్ల కష్టాన్ని అంకితభావం అనడం కంటే భక్తి అనాలని ఉంది. మూడు రోజులు బ్రేక్ తీసుకోకుండా నిరంతరం దీని చిత్రీకరణ జరిగింది. ఈ క్లైమాక్సు చిత్రీకరించడం ఎంతో సవాలుగా అనిపించింది. అదే సినిమాకు హైలైట్. రెండు శక్తిమంతమైన శక్తులు ఢీకొంటే ఎలా ఉంటుందో తెరపై చూస్తారు. ఇప్పటివరకూ ఏ సినిమాకు కూడా ఇలాంటి క్లైమాక్స్ లేదు" అని నిర్మాత శివన్ నారంగ్ తెలిపారు. ఈ సినిమా గురించి సుధీర్ బాబు ఇటీవల మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగుపెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్లు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్గా, ఎమోషనల్గా అద్భుతంగా ఉంటుంది" అన్నారు.

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

రిపబ్లిక్ స్పోర్ట్స్
విరాట్ సూపర్ క్యాచ్..
ఫీల్డింగ్లో రోహిత్ శర్మ మెరుపులు!

భారత స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్లో ఆడుతున్న సంగతి తెలిసిందే. విరాట్ రెండు మ్యాచుల్లో డకౌట్ కాగా.. రోహిత్ ఒక హాఫ్ సెంచరీ చేశాడు. ఇవాళ ఆసీస్లో మూడో వన్డే బరిలోకి దిగారు. ఆస్ట్రేలియా టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో సీనియర్లు తమ అద్భుతమైన ఫీల్డింగ్తో అబ్బురపరిచారు. విరాట్ కోహ్లి షార్ప్ క్యాచ్ను అందుకోగా.. రోహిత్ చురుకైన ఫీల్డింగ్తో ఆకట్టుకున్నాడు.

భలేగా పట్టేశాడు..

అది వాషింగ్టన్ సుందర్ బౌలింగ్. ఇన్నింగ్స్ లో 23వ ఓవర్. అవుట్పైడ్ ఆఫ్ వేసిన బంతిని ఆసీస్ బ్యాటర్ మాథ్యూ షార్ట్ బలంగా బాదాడు. అంతా ఫోర్ వెళ్లడం ఖాయమని భావించారు. ఎందుకంటే అతడు కొట్టిన వేగం అలాంటిది. కానీ, స్క్వేర్ లెగ్లోని విరాట్ కోహ్లి సూపర్ క్యాచ్ అందుకొన్నాడు. ఆ దెబ్బకు షార్ట్ (30) తీవ్ర నిరాశతో పెవిలియన్ బాట పట్టాడు. సిడ్నీ మైదానమంతా కోహ్లి పేరుతో హోరెత్తిపోయింది. ఇక రోహిత్ శర్మ కూడా తన ఫిట్నెస్ పవర్ ఏంటో చూపించాడు. అద్భుతమైన ఫీల్డింగ్ విన్యాసాలతో బంతిని ఆపాడు.

వరల్డ్ కప్లో ఆడేంత ఫిటెనెస్..

మరో రెండేళ్లపాటు ఎలా నెట్టుకొస్తారోననే అనుమానాలు కలిగిన వారికి రోహిత్, విరాట్ తమ ఫీల్డింగ్ జవాబు చెబుతున్నారు. విరాట్ కోహ్లి అంటే మైదానంలో ఎప్పుడూ చురుగ్గానే ఉంటాడు. అయితే, గత రెండు మ్యాచుల్లో డకౌట్ కావడంతో సిడ్నీ మ్యాచ్ అనంతరం వీడ్కోలు చెబుతాడనే చర్చ సాగుతోంది. కానీ, విరాట్ మాత్రం ఆ దిశగా ఆలోచనలు చేస్తున్నట్లు కనిపించలేదని మాజీలు అంచనా వేస్తున్నారు. ఇక ఈ సిరీస్ కోసం నాజూగ్గా తయారై వచ్చిన రోహిత్.. ఫీల్డింగ్, రన్నింగ్లో ఎలా ఉంటాడోనని కాస్త సందేహం వచ్చింది. వాటన్నింటినీ పటాపంచలు చేస్తూ అదరగొట్టేస్తున్నాడు. సూపర్ ఫీల్డింగ్తో తాము వచ్చే వన్డే వరల్డ్ కప్లోనూ ఆడతామని చెప్పకనే చెబుతున్నారు.

ఇంటి చిట్కాలు
అందమైన ముఖం, జుట్టు కోసం అలోవెరా ఎలా వాడాలి, ఇప్పుడు తెలుసుకోండి

అలోవెరాని ఇప్పుడు చెప్పినట్టుగా వినియోగిస్తే చర్మంతో పాటు కురులు కూడా ఆరోగ్యకరంగా మారతాయి. ఇందులో ఉండే కొన్ని గుణాలు చర్మంపై ఉండే డెడ్ సెల్స్ ని తొలగించి మెరిపిస్తాయి. ఇక కురుల విషయంలోనూ ఇంతే. పొడిబారిపోవడం, చివర్లు చిట్లిపోవడం, రాలిపోవడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది అలోవెరా. సరిగ్గా వాడడం తెలిస్తే అలోవెరా జెల్ తో అద్భుతాలు చేయవచ్చు అంటున్నారు బ్యూటీ ఎక్స్ పర్ట్స్. అంతే కాదు. అసలు ఈ జెల్ ని ముఖానికి, జుట్టుకు ఏ విధంగా వాడాలి అన్నది కూడా వివరించారు.

ముఖం అందంగా మెరిసిపోవాలని, జుట్టు ఒత్తుగా పెరగాలని ఎవరికి ఉండదు చెప్పండి. అందరూ ఇలాగే ఆశపడతారు. ఇప్పుడున్న లైఫ్ స్టైల్, కాలుష్యం కారణంగా ఈ రెండూ కుదరడం లేదు. చాలా మందికి ఇవి కలలుగానే మిగిలిపోతున్నాయి. ముప్పై ఏళ్లు దాటాయంటే చాలు. ముఖంపై ముడతలు వచ్చేస్తున్నాయి. జుట్టు రాలడం మొదలవుతోంది. అప్పటి నుంచి రకరకాల క్రీమ్స్, జెల్స్ వాడుతూ మేనేజ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. కానీ అవి పూర్తి స్థాయిలో మళ్లీ మామూలు స్థితికి రావు. ఈ వెలితి లేకుండా ఉండాలంటే తప్పనిసరిగా నేచురల్ చిట్కాలు పాటించాలి. అంటే..సహజంగానే ముఖంతో పాటు జుట్టును మెరిపించే పదార్థాలు వాడాల్సి ఉంటుంది. అలాంటి వాటిలో ఒకటి కలబంద. చాలా చవకగా దొరికే ఈ కలబందతోనే ముఖంతో పాటు కురులను మెరిపించవచ్చు. మరి ఏ విధంగా వాడితే ఇది సాధ్యమవుతుంది అనే వివరాలు తెలుసుకుందాం.

అలోవెరా ఉపయోగాలు

చర్మం డల్ గా మారిపోయి కళ లేకుండా పోయినప్పుడు మళ్లీ అందంగా కనిపించడానికి రకరకాల క్రీమ్స్ వాడుతుంటారు. ఇవన్నీ ఫలితాలు ఇస్తుండవచ్చు. కానీ ఇదంతా తాత్కాలికం మాత్రమే. శాశ్వత పరిష్కారం కావాలంటే మాత్రం సహజమైన పద్ధతులనే వెతుక్కోవాలి. అలాంటి వాటిలో ఒకటి..అలోవెరాని వాడడం. పాడైపోయిన చర్మాన్ని సరి చేయడంలో కలబంద చాలా బాగా పని చేస్తుంది. డెడ్ సెల్స్ ని తొలగించడం ఒక్కటే కాదు. డ్యామేజ్ అయిన కణాలను బాగు చేసి క్రమంగా వాటిని అందంగా కనిపించేలా చేస్తుంది. ముఖ్యంగా చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడంలో తోడ్పడుతుంది. కలబందలో విటమిన్స్, ఎంజైమ్స్ తో పాటు మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. సరైన విధంగా వాడితే కురుల కుదుళ్ల నుంచి ఆరోగ్యంగా ఉంటాయి. ఎప్పటికీ కురులకు తేమను అందిస్తూ అవి చిట్లిపోయి రాలిపోకుండా కాపాడుతుంది కలబంద. కురుల ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది.

మరి కొన్ని ప్రయోజనాలు

అలోవెరాలో ఉండే మరో కీలకమైన గుణం ఏంటంటే..హైడ్రేషన్. ముఖాన్ని అయినా, కురులను అయినా ఎప్పటికీ హైడ్రేటెడ్ గా ఉంచడంలో సాయపడుతుంది. ఈ కారణంగానే కురులు ఆరోగ్యంగా పెరుగుతాయి. వారానికి ఓ సారి అలోవెరా వాడితే కురులతో పాటు ముఖం కూడా అందంగా మెరిసిపోతుంది. ఇందాకే చెప్పుకున్నట్టుగా ఇందులో బోలెడన్ని విటమిన్స్ ఉంటాయి. అయితే..ఇందులో యాంటీ బ్యాక్టీరియల్ సహా యాంటీ ఆక్సిడెంట్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అన్నింటి కన్నా ముఖ్యమైన విషయం ఏంటంటే..కలబంద రసాన్ని నేరుగా తీసుకోవడం వల్ల జీర్ణ శక్తి కూడా మెరుగవుతుంది. ఆయుర్వేదంలో గట్ డిటాక్స్ కి ఈ కలబంద రసాన్నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇక మొటిమలు, తామర సహా ఇతరత్రా చర్మ సమస్యలను తగ్గించడానికి కూడా అలోవెరాలోని గుణాలు ఎంతో బాగా తోడ్పడతాయి.

ఎలా వాడితే మంచిది

అలోవెరా ఆరోగ్యానికి మంచిదే కానీ..దాన్ని సరైన విధంగా వాడడం తెలియాలి. ముందుగా కలంబదను కట్ చేసి పైన ఉన్న ఆకుపచ్చని తొక్కను తొలగించాలి. లోపలి జెల్ ని ప్రత్యేకంగా ఓ గిన్నెలోకి తీయాలి. ఈ జెల్ ని ముఖానికి బాగా అప్లై చేయాలి. సరైన విధంగా అప్లై చేసిన తరవాత కనీసం అరగంట పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల లోపలి వరకూ అలోవెరా చొచ్చుకుని పోతుంది. డెడ్ సెల్స్ తొలగిపోయేందుకు వీలుంటుంది. అరగంట తరవాత చల్లని నీళ్లతో ముఖం కడుక్కోవాలి. మీకు కాసేపట్లోనే కాస్త తేడా కనిపిస్తుంది. ముఖం చాలా ఫ్రెష్ గా మారిపోతుంది. అయితే రోజుకు కనీసం రెండు సార్లు ఇలా అలోవెరాతో మసాజ్ చేసుకుంటే కొద్ది రోజుల్లోనే ఫలితాలు చూడవచ్చు. అప్పటి వరకూ మొటిమలతో ఇబ్బంది పడుతున్న వారు చాలా త్వరగా ఈ సమస్య నుంచి బయటపడతారు. అంతే కాదు. వేలాడుతూ కనిపించే చర్మం కూడా బిగుతుగా మారిపోతుంది. ముఖంలో వెలుగు వస్తుంది.

ఎలా పని చేస్తుంది

సూర్యరశ్మి తగిలినప్పుడు చర్మం కాస్త కరుకుగా మారుతుంది. అయితే ఈ సూర్యరశ్మి కారణంగా చర్మంపై ట్యాన్ రాకుండా, మచ్చలు ఏర్పడకుండా కలబంద చాలా ఎఫెక్టివ్ గా పని చేస్తుంది. ఇక అలోవెరాని ఫేస్ మాస్క్ లా కూడా వినియోగించవచ్చు. అలోవెరా జెల్ లో కొన్ని చుక్కల తేనె కలపాలి. లేదా పసుపు వాడినా సరిపోతుంది. ఈ మూడింటినీ బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసుకోవాలి. కనీసం 20 నిముషాల పాటు అలాగే ఉంచాలి. ఇలా చేయడం వల్ల చర్మంలో ఇన్ ఫ్లమేషన్ అనేది తగ్గిపోతుంది. అంతే కాదు. స్కిన్ టోన్ కూడా మారిపోతుంది. చర్మం మెరిసిపోయేందుకు ఇది తోడ్పడుతుంది. ముఖ్యంగా మొటిమలు తగ్గిపోవడానికి ఇది సహకరిస్తుంది. నిద్రపోయే ముందు ముఖంపై ఎక్కడైతే నల్లటి మచ్చలు, వలయాలు ఉన్నాయో అక్కడ కలబంద జెల్ ని అప్లై చేయాలి. ఇలా చేయడం వల్ల మరుసటి రోజు ఉదయానికి చర్మం చాలా ఫ్రెష్ గా మారిపోతుంది. అలోవెరాలో ఉండే యాంటీ మైక్రోబయల్ గుణాలు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సాయపడతాయి

జుట్టుకు ఎలా వాడాలి

ముఖానికి కలబంద ఎలా వాడాలో తెలుసుకున్నాం. ఇప్పుడు కురులకు ఏ విధంగా వినియోగించాలో తెలుసుకుందాం. అలోవెరా జెల్ ని నేరుగా కురులకు స్కాల్ప్ కి అప్లై చేయాలి. అయితే అంత కన్నా ముందు కలబంద నుంచి జెల్ తీసి దాన్ని సాఫ్ట్ గా మారేంత వరకూ మిక్స్ చేయాలి. ఆ తరవాత అప్లై చేసుకోవాలి. అప్లై చేసిన తరవాత కనీసం అరగంట పాటు అలాగే ఉంచాలి. అరగంట తరవాత మీరు రోజూ వాడే షాంపూతోనే తల స్నానం చేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల తలపై దురద, చుండ్రు లాంటివి తగ్గిపోతాయి. అంతే కాదు. అలోవెరా జెల్ లో కాస్తంత కొబ్బరి నూనె లేదా ఆముదం నూనె కలిపి హెయిర్ మాస్క్ లా కూడా వాడవచ్చు. ఇలా అప్లై చేసిన తరవాత కనీసం 45 నిముషాల పాటు అలాగే ఉంచాలి. ఆ తరవాతే శుభ్రం చేసుకోవాలి. క్రమంగా కురులు ఆరోగ్యకరంగా పెరుగుతాయి.